ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ.. ప్రాంతాల వారీ విశ్లేషణ

సహజవనరులు, మూలధన వనరులు, మానవనరుల సమర్థ వినియోగం ఒక ప్రాంతం అభివృద్ధిని వేగవంతం చేయడంతోపాటు ఆ ప్రాంత ఆర్థిక స్వరూపాన్ని నిర్ణయించడంలో ప్రధాన పాత్ర వహిస్తాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత.. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వృద్ధి పెరిగింది. 1960లలో సగటున 2 శాతం కంటే తక్కువగా ఉన్న రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి 1990లలో 5 శాతం పైగా నమోదయింది. జీఎస్‌డీపీలో వ్యవసాయరంగ ప్రాధాన్యం తగ్గడం, వృత్తుల వారీ పంపిణీలో మార్పులు, మౌలిక సౌకర్యాల అభివృద్ధి వంటి ఎన్నో నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. 2001-04 మధ్య 5.58 శాతంగా ఉన్న వృద్ధిరేటు 2004-07 మధ్య 7.46 శాతానికి చేరుకుంది. 1991లో దేశంలో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థికవిధానాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేశాయి. ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు.. వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు పెరగడానికి కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలో వివిధ అంశాలకు సంబంధించి ప్రాంతాలవారీ విశ్లేషణ ఎలా ఉందో తెలుసుకొనే ఉద్దేశంతో ఈ సిలబస్‌ను రూపొందించారు.

పేపర్- III

విభాగం-2 యూనిట్ 2 సిలబస్

- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్వరూపం - దాని రంగాల వారీగా ప్రాంతీయ పంపిణీ,
- దారిద్ర్య పరిమాణం,
- వ్యవసాయ ఉత్పాదకాలు,
- సాంకేతిక విజ్ఞానం.

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్:

1. ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థ ప్రస్తుత స్థితిని వివరించండి?

జ: ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో వెనుకబడిన ఆర్థికవ్య వస్థగా



ఉన్న రాష్ట్రం ప్రణాళికల అమలు నేపథ్యంలో.. అభివృద్ధి చెందు తున్న ఆర్థిక వ్యవస్థగా రూపొందింది. 1955- 56లో రాష్ట్ర నికర ఆదాయం రూ. 584 కోట్లు కాగా 2008- 09లో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి ఆదాయం రూ. 2,52,318 కోట్లు. ఇదే కాలానికి సంబంధించి తలసరి ఆదాయం రూ. 174 నుంచి రూ. 26,983 (స్థిరధరలవద్ద)కు పెరిగింది. 1990వ దశకం ప్రారంభం నుంచి వ్యవసాయరంగ ప్రగతి అంత సంతృప్తికరంగా లేదు. 2004 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల మూలంగా వ్యవసాయ రంగంలో ప్రోత్సాహక వాతావరణం ఏర్పడింది. ఫలితంగా 2008 -09లో ఈరంగం 2.27శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి 204.04 లక్షల టన్నులకు పెరిగింది. నిర్మాణంలో ఉన్న 81 నీటి పారుదల ప్రాజెక్టులు భవి ష్యత్‌లో వ్యవసాయరంగ అభివృద్ధికి దోహదపడగలవు. ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటు ద్వారా పారిశ్రామికీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సేవా రంగానికి సంబంధించి మౌలిక సౌకర్యాల కల్పనకు ఎంతో ప్రాధాన్య మిచ్చింది. ఈ నేపథ్యంలో 2004 నుంచి ఇప్పటి వరకు జీఎస్‌డీపీ వృద్ధి రేటులో పెరుగుదల నమోదు కాగా.. 2008-09 లో సంక్షోభ ప్రభావంవల్ల జీఎస్‌డీపీ 5.53శాతంగా నమోద యింది.

☞ ఈ క్రమంలో 2004వ తర్వాత జీఎస్‌డీపీ వృద్ధి రేటు గమనిస్తే.. 2004లో 8.15 శాతం, 2005లో 10.24 శాతం, 2006-07లో 11.16 శాతం, 2007-08లో 10.62 శాతంగా నమోదయింది. జీఎస్‌డీపీ వృద్ధి, వివిధ రంగాల్లో ప్రగతిని వివరిస్తూ సమాధానం రాయాలి.

2. రాష్ట్రంలో వివిధ ముఖ్య అంశాలకు సంబంధించి ప్రాంతాల వారీ విశ్లేషణ వివరించండి?

జ. రాష్ట్రంలో లభ్యమయ్యే వనరులు వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలకు దారి తీశాయి. స్థూల ఉత్పత్తిని ప్రాంతాలవారీగా పరిశీలించినపుడు కోస్తా మొదటి స్థానంలో తెలంగాణ, రాయలసీ మలు తదుపరి స్థానాల్లో ఉన్నాయి. వృత్తుల వారీ జనాభా పంపిణీ ప్రకారం కోస్తా ఆంధ్ర ప్రాంతంలో అత్యధికంగా శ్రామికులుంటే

తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో తక్కువగా ఉన్నారు. జన సాంద్రత, పారిశ్రామిక కార్మికులు, నిరుద్యోగుల పరంగా మిగతా ప్రాంతాల కంటే కోస్తా ఆంధ్రా ప్రాంతం ముందుంది. సేద్యయోగ్యమైన భూమి, సేద్యానికి అనువుగా లేని భూమి తెలంగాణ ప్రాంతంలో ఎక్కువ.సాగు కమతాలు తెలంగాణలో ఎక్కువ ఉంటే తర్వాత కోస్తా ఆంధ్ర, రాయలసీమలున్నాయి. ప్రాంతాలవారీగా పరిశీలించినపుడు.. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో పరిశ్రమల సంఖ్య ఎక్కువ. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయి. తలసరి విద్యుత్ వినియోగం కోస్తా ఆంధ్ర ప్రాంతంలో ఎక్కువ. తర్వాత తెలంగాణ, రాయలసీమలున్నాయి. విద్యారంగ గణాంకాలు పరిశీలిస్తే కోస్తా ఆంధ్రలో అక్షరాస్యులు ఎక్కువ. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయి.

☞ ఈ క్రమంలో వివిధ అంశాలకు సంబంధించి పైన వివరించిన విధంగా గణాంకాల సహాయంతో ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను పరిశీలించాలి. ముఖ్యంగా నీటి పారుదల కల్పనలో వ్యత్యాసాలు ప్రాంతాల మధ్య ఆదాయ అసమానతలకు దారి తీశాయి. తదుపరి పారిశ్రామిక స్థితిగతులు, అవస్థాపనా సౌకర్యాల లభ్యతను ప్రాంతాల వారీగా విశ్లేషించాలి.

3. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలకు కారణాలు విశ్లేషించి నివారణకు మార్గాలు సూచించండి?

జ. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నీటి పారుదల ప్రాజెక్టుల కేంద్రీకరణ, హరిత విప్లవం కారణంగా కోస్తా ఆంధ్ర ప్రాంతం మిగిలిన ప్రాంతాల కంటే వ్యవసాయపరంగా అభివృద్ధి సాధించింది. పారిశ్రామిక రంగాన్ని పరిశీలించినపుడు ఉత్తరకోస్తా ప్రాంతం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చోటు చేసుకున్న పారిశ్రామికీకరణ వల్ల ఆ రెండు ప్రాంతాల్లో తలసరి ఆదాయం పెరిగింది. ఫలితంగా ప్రాంతీయ వ్యత్యాసాలు పెరిగాయి. సేవా రంగానికి సంబంధించిన కార్యకలాపాలు కూడా పట్టణ ప్రాంతాలలో కేంద్రీకరించి నందు వల్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఆదాయ వ్యత్యాసాలు పెరిగాయి. సాగుభూమి, పరిశ్రమల ఏర్పాటు, అక్షరాస్యత, వైద్యసౌకర్యాల కల్పనకు సంబంధించి కూడా జిల్లాల మధ్య అసమానతలు పెరిగాయి. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతున్న దృష్ట్యా ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధి భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం సంతరించుకోనుంది.

☞ ఈ నేపథ్యంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు సంబంధించి ప్రాంతాల మధ్య వ్యత్యాసాలకు కారణాలను విశ్లేషించాలి. సమగ్ర ప్రాంతీయ వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించాలి. దీంతోపాటు భవిష్యత్తులో ప్రాంతీయ అసమానతలను రూపుమాపడానికి చేపట్టాల్సిన చర్యలను పొందుపరచాలి. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం, ప్రత్యేక ఆర్థికమండళ్ల ఏర్పాటు, తీర ప్రాంతాల్లో పోర్టుల నిర్మాణం వల్ల చోటు చేసుకునే సేవారంగ కార్యకలాపాల పెరుగుదలను కూడా పరిశీలించాలి.

4. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఆర్థికాభివృద్ధి పేదరికం తగ్గడానికి దోహదం చేసిందో లేదో వివరించి పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను వివరించండి?

జ. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగం, అధిక జనాభా వృద్ధిరేటు, వ్యవసాయరంగంలో ఉత్పాదకత తక్కువగా ఉండి ఆదాయం తక్కువగా ఉండటం, వ్యవసాయేతర రంగాలు అభివృద్ధికి నోచుకోలేకపోవడం, అల్పమానవాభివృద్ధి పేదరికం పెరుగుదలకు కారణమయ్యాయి. రాష్ట్రంలో చోటు చేసుకున్న ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో పేదరికం తగ్గు ముఖం పట్టింది. 1973-74లో 48.86 శాతం ప్రజలు దారిద్ర్య రేఖ దిగువన ఉండగా వీరి శాతం 1987-88లో 25.60 శాతం, 1993-94లో 22.19 శాతం, 2004-05లో 15.80 శాతానికి తగ్గింది.

☞ ఈ క్రమంలో ఆర్థికాభివృద్ధి పేదరికం తగ్గుదలకు ఏ విధంగా దోహదం చేసిందో పరిశీలించాలి. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో చోటు చేసుకున్న అభివృద్ధితో పాటు ప్రభుత్వం చేపట్టిన పేదరిక నిర్మూలనా కార్యక్రమాల వల్ల పేదరికం ఏ విధంగా తగ్గు ముఖం పట్టిందో విశ్లేషించాలి. పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన భూసంస్కరణ, సూక్ష్మవిత్తం, పాడిపరిశ్రమ వంటి సంక్షేమ కార్యక్రమాలు ఎలా దోహదపడ్డాయో వివరించాలి.

5. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగాభివృద్ధిలో ఉత్పాదకాలు, సాంకేతిక విజ్ఞానపాత్రను పరిశీలించండి?

జ. వ్యవసాయరంగాభివృద్ధికి నీటిపారుదల సౌకర్యాలు, విద్యుత్, పరపతి, మేలైన వంగడాలు వంటి ముఖ్య వ్యవసాయ ఉత్పాదకాలు అవసరం. వీటి లభ్యతలో కొరత వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకతపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపిస్తుంది.

☞ ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రస్తుతం లభ్యమవుతున్న వ్యవసాయ ఉత్పాదకాలను గణాంకాలతో సహా వివరిస్తూ వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలపై వాటి ప్రభావాన్ని విశ్లేషించాలి. హరిత విప్లవం తర్వాత వ్యవసాయ రంగంలో ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగినప్పటికీ అది కొన్ని పంటలకే పరిమితమైంది. రాష్ట్రంలో రెండో హరిత విప్లవం ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ ఉత్పాదకాల లభ్యత పెంపుదల కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ సమాధానం రాయాలి.

ముఖ్యాంశాలు

- 2008-09 సంవత్సరంలో (1999-2000 ధరల వద్ద) రాష్ట్ర స్థూలదేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) రూ. 2,52,318 కోట్లు కాగా జీఎస్‌డీపీ వృద్ధి రేటు 5.53 శాతం.
- 2008-09 సంవత్సరంలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థలో వ్యవసాయరంగం

2.27 శాతం, పారిశ్రామిక రంగం 0.12 శాతం, సేవారంగం 10.06 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి.

- రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తితో 2008-09లో వ్యవసాయరంగం వాటా 23.9 శాతం, పారిశ్రామిక రంగం వాటా 25 శాతం, సేవారంగం వాటా 51.1శాతం.
- స్థిరధరల వద్ద 2008-09లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 26,983 కాగా ప్రస్తుత ధరల వద్ద రూ. 39,597.
- ద్రవ్యలోటు జీఎస్‌డీపీలో 2007-08లో 2.68 శాతం.
- రాష్ట్ర ప్రభుత్వ మొత్తం రుణం 2008 మార్చి నాటికి రూ. 82,479 కోట్లు, జీఎస్‌డీపీలో దీని వాటా 25.12 శాతం.
- రాష్ట్రంలో మొత్తం భూవిస్తీర్ణం 275.04 లక్షల హెక్టార్లు కాగా దీనిలో నికర సాగుభూమి శాతం 39.8(109.60ల.హె.)